క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్లరూరల్: మండలంలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తెలియజేశారు. మండలంలోని కోనంకి, పాతగణేశునిపాడు, జూలకల్లు, బ్రాహ్మణపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11/33కేవీ ఎల్‌టీ లైన్‌లు ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు చేయటం జరుగుతుందని తెలిపారు. కావున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని అన్నారు.

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సైదారావు తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ అన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని తెలియజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం

పిడుగురాళ్ల: సంక్రాంతి పండగ సందర్భంగా పిడుగురాళ్ల పట్టణ, రూరల్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు అన్నారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకొని కోడి పందేలు, గుండాట, జూదం నిర్వహించటం నిషేధమన్నారు. పోలీసు వారి ఆజ్ఞలను అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేసి, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మాచర్ల రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, ఇతర జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని, ఎవరైనా కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ అభిమానికి కొత్త పింఛన్ మంజూరు

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు వివిధ పథకాలను అందిస్తున్న విషయం విదితమే. శుక్రవారం మండలంలోని కోలగుట్ల గ్రామ సచివాలయం పరిధిలో తెలుగుదేశం సానుభూతి పరుడు పాన్నూరి సలోమానుకు నూతనంగా మంజూరైన వృద్ధాప్య పెన్షన్ రూ.3వేలు స్థానిక సర్పంచ్ మద్దికర శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పథకాలను అందించాలని కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. పార్టీకలతీతంగా పింఛన్ మంజూరు కావడం పట్ల లబ్ధిదారుడు సలోమాను హర్షం వ్యక్తం చేశాడు.

సత్తా చాటుతున్న క్రీడాకారులు


ఖోఖో ఆడుతున్న ఆటగాళ్లు


మండల స్థాయి క్రికెట్ పోటీలలో విజేతగా నిలిచిన తుమ్మకోట జట్టు

- ఉత్కంఠగా సాగుతున్న ఆటల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు

దాచేపల్లి : ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో ఆటగాళ్లు సత్తా చాటుతున్నారు. కేసానుపల్లి గీతాగురుకులం క్రీడా ప్రాంగణంలో శుక్రవారం ఖోఖో విభాగంలో ఆటల పోటీలు జరిగాయి. దాచేపల్లి, ఇరికేపల్లి, కేసానుపల్లి, రామాపురం, ముత్యాలంపాడు, పెదగార్లపాడు గ్రామాల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. క్రీడాకారులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీలను నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, ఎంపీడీవో శోభారాణి ప్రారంభించారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు వరం

రెంటచింతల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం క్రీడాకారులైన యువతకు ఓ వరం అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రాలో శుక్రవారం ఆమె క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, యువతకు రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు భారీ స్థాయిలో ఆటల పోటీలను నిర్వహించి వారిలో మెరుగైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడమే లక్ష్యంగా సీఎం జగన్ ఈ పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. రెంటచింతల-3 జట్టుపై తుమ్మకోట టీం, రెంటచింతల-1 టీంపై రెంటాల జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్‌లో 10 ఓవర్లలో రెంటాల టీం 5 వికెట్ల నష్టానికి 57 పరుగులు సాధించగా తుమ్మకోట జట్టు 9.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 58 పరుగులు సాధించి మండల స్థాయిలో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పీఈటీ కత్తి రవి తెలిపారు. శనివారం నుంచి వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరావు, కార్యదర్శి జే వెంకయ్య, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా

పిడుగురాళ్లరూరల్: పోటా పోటీగా యువతీయువకులు ఆడుదాం ఆంధ్రాలో పాల్గొంటున్నారు. మండల స్థాయిలో ఎంపికైన జట్లు తలపడగా కొన్ని జట్లు నియోజకవర్గ స్థాయికి ఎన్నికయ్యాయి. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలలో జానపాడు, తుమ్మలచెరువు, పందిటివారిపాలెం, కోనంకి గ్రామాలు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యాయి.


ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

గ్రామీణ ప్రజలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష

కారెంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం మండలంలోని మిరియాల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరంలో డాక్టర్లు, సిబ్బంది వైద్య సేవలందించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 376 మంది డాక్టర్లకు చూపించుకుని ఉపశమనం పొందారు. డాక్టర్లు శ్రీనివాసరావు, వై.లక్ష్మి, ఎం.రమ్య వైద్య సేవలందించారు. శిబిరానికి వచ్చిన వారు ముందుగా ఓపీ రాయించుకుని జగనన్న సురక్ష కార్డులు పొందారు. కార్డులు పొందిన వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు పరీక్షలు చేశారు. ఆప్తాలమిక్ అఫీసర్ జి.శ్రీధర్ కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమైన వారి పేర్లు నమోదు చేసుకున్నారు. తమ గ్రామంలోనే డాక్టర్లకు చూపించుకునే అవకాశం కల్పించిన జగనన్నకు ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ బత్తుల ఏడుకొండలు, ఉప సర్పంచ్ దారెడ్డి ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ కొమ్మిరెడ్డి విజయా గురువారెడ్డి గ్రామ పెద్దలు, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు పాల్గొన్నారు.


ఓపీ రాయించుకుంటున్న ప్రజలు

దుర్గి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గ్రామీణ ప్రజానీకానికి జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప వరమని ఎంపీడీఓ కె.సమతావాణి సర్పంచి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోలగుట్ల గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న గ్రామీణ ప్రజలు సుదూర పట్టణాలలో చికిత్స పొందటం ఇబ్బందిగా ఉంటుందన్నారు. గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో షుగర్, బీపీ, తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై వైద్య పరీక్షలు చేయించుకొని మందులను తీసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ గుప్తా, ఏవో శివప్రసాద్, పీఆర్‌ఏఈఎస్ వెలిగొండ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరెడ్డి, ఆదయ్య, మంగారావు, స్పెషలిస్టు డాక్టర్లు ముటుకూరు పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధిలో భాగస్వామ్యం కండి

చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ


నగర పంచాయతీ సమావేశం జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి : నగర పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ సుబ్బమ్మ అధ్యక్షతన దాచేపల్లి సచివాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి బడ్జెట్‌కి సభ్యులు ఆమోదం తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.3.70 కోట్ల నిల్వతో మొదలై రూ.13 కోట్లతో అభివృద్ధి చేసి రూ.3.82 కోట్లు నిల్వ ఉన్నట్లుగా కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.3.82 కోట్ల ప్రారంభ నిల్వతో రూ.14.99 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి రూ.3.70 కోట్ల నిల్వ ఉంటుందనే అంచనాలు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. చైర్‌పర్సన్ సుబ్బమ్మ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దాచేపల్లిని నగర పంచాయతీగా ఏర్పాటు చేయించారని, నగర పంచాయతీలో కోట్లాదిరూపాయల అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఒక్క నగర పంచాయతీ పరిధిలో 3వేల మందికి పైగా ఇంటి పట్టాలు ఇచ్చామని, కొట్లాబజార్‌లో సిమెంట్ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించామని వివరించారు. ప్రమాదకరంగా ఉన్న కాటేరువాగుని ఆధునీకరణ చేశామని, దాచేపల్లి-నడికుడిల మధ్య నాగులేరుపై లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగర పంచాయతీ అభివృద్ధిలో కౌన్సిల్ సభ్యులు భాగస్వాములు కావాలని, వార్డుల్లోని సమస్యలు కౌన్సిల్ దృష్టికి తీసుకువస్తే సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామోదయం


రెంటాలలోని గ్రామోదయంలో ఎంపీపీ చౌడేశ్వరి, ఎంపీడీఓ మహాలక్ష్మి


పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ జోసెఫ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి

రెంటాల(రెంటచింతల): గ్రామాలలోని సమస్యలను పరిష్కరించడానికే గ్రామోదయం కార్యక్రమం తలపెట్టినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మండల పరిధిలోని రెంటాల గ్రామంలో శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధికారులతో కలిసి గ్రామంలోని పలు కాలనీలలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కార్యదర్శికి సూచించారు. బడి ఈడు పిల్లలతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లను సందర్శించి గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తల ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువును తయారుచేయడం ద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

కారెంపూడి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో పారిశుద్ధ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్ గ్రామ పంచాయతీ పాలకవర్గాలను ఆదేశించారు. మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు బ్రహ్మనాయుడు కాలనీలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సైడ్ కాల్వలు నిర్మించాలని ప్రజలు ఆయనకు తెలిపారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించడంతో పాటు బ్లీచింగ్ చల్లించాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్కడ కార్మికులతో కలసి టీ తాగి పనుల గురించి ఆరా తీశారు. ఎంపీపీ శారదాశ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, గ్రామ సర్పంచ్ మదాసు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ అల్లు వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

మాచర్ల రూరల్: అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాల ద్వారా ప్రతి పేదవానికి ప్రభుత్వ పథకాలు చేరవేస్తున్నామని, గ్రామాభివృద్ధిలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సరోజనీదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని తాళ్ళపల్లిలో గ్రామోదయంలో ప్రజలతో ఆమె మాట్లాడారు. గ్రామంలో ఉపాధి హామీ పనుల తీరును అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు సరఫరా అవుతున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వర్మికంపోస్టు యార్డును పరిశీలించి సిబ్బందితో కాఫీ బ్రేక్ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు వెస్లి, ఎంఈవో వేముల నాగయ్య, సర్పంచ్ యంద్ర గాలయ్య, ఆవుల వెంకట్రామయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, పంచాయతీ కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విస్తృత తనిఖీలు

గురజాల : మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు గురజాల సెక్షన్ పరిధిలోని పులిపాడు, చర్లగుడిపాడు, పల్లెగుంత, మాడుగుల, జంగమహేశ్వరపురం, గోగులపాడు, అంబాపురం, కొత్త అంబాపురం గ్రామాల్లో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.హరిబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రవికుమార్‌ల ఆధ్వర్యంలో 50 మంది అధికారులు, 150 మంది సిబ్బంది 50 బృందాలుగా ఏర్పడి 4,761 సర్వీసులు తనిఖీ చేయగా వారిలో 189 మంది నేరుగా అనుమతి లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు గుర్తించి రూ.8.69 లక్షలు, మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 100 మందికి రూ.3.62 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 7 మందికి రూ.1 లక్ష, అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుతున్న 82 మందికి రూ.4.07 లక్షలు అపరాధ రుసుం వేసినట్లు అధికారులు తెలిపారు. ఎవరైనా విద్యుత్‌ను అక్రమంగా వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రైతు ఆత్మహత్య



దాచేపల్లి : తీవ్ర మనస్తాపంతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో రైతు కడియం రవికుమార్(30) ఇంట్లోని ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సారంగపల్లి అగ్రహారంకు చెందిన రవికుమార్‌కి భార్య సాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడు ఎకరాల పొలంలో మిరప పంటను సాగుచేస్తున్నాడు. మొత్తం రూ.10లక్షల వరకు అప్పు చేశాడు. కాగా కేసానుపల్లిలోని అత్తగారింటికి అతను రెండు రోజుల క్రితం వచ్చాడు. అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపంతో అత్తగారింటిలోనే ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సంధ్యారాణి ఘటన స్థలానికి చేరుకుని మృతదేహం పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రహదారి భద్రత అందరి బాధ్యత

దాచేపల్లి: ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమ నిబంధనలు తప్పక పాటించాలని మాచర్ల ఎంవీఐ శేషురెడ్డి అన్నారు. మండలంలోని గామాలపాడు పరిధిలోని ఏడీ సిమెంట్స్‌లో 35వ రహదారి భద్రత వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. వారోత్సవాల జెండాను ఎంవీఐ ఆవిష్కరించి మాట్లాడుతూ వాహన చోదకులు తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలని, అన్ని పత్రాలు ఉండాలన్నారు. ద్విచక్రవాహనంపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీఏలు శ్రీనివాసరావు, సురేష్‌కుమార్, జీఎం నరేంద్రరెడ్డి, సీనియర్ మేనేజర్ సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



మాచర్ల రూరల్: స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన ధృడ సంకల్పం, పట్టుదల, స్ఫూర్తితో యువత ముందుకు పోవాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి కోరారు. శుక్రవారం కంభంపాడు గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పాఠశాలలో మొక్కలు నాటారు. శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, కొండలు, పెద నరసింహారావు, జగన్, అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

మాచర్ల: యువతకు ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద అని, ఆయన భావాలను భావితరాలకు అందించాలని పట్టణ సీఐ పి.శరత్‌బాబు, రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లా ప్రాంతంలోని వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సెక్రటరీ పుల్లారావు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్, కోటిరెడ్డి, నరసింహారావు, రామాంజి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వీరయ్య, లక్ష్మయ్య, పాపిరెడ్డి, సూర్యచంద్ర, పాండురంగారావు, అప్పారావు తదితరులున్నారు.

అభివృద్ధిలో పథంలో లైమ్‌సిటీ


పిడుగురాళ్ల పట్టణం ఏరియల్ వ్యూ

- విశాలమైన రోడ్లతో అభివృద్ధి
- పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు ఎదుగుదల
- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు బైపాస్ నిర్మాణం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణం రోజు రోజుకు అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుంది. పిడుగురాళ్ల సుమారు 200 ఏళ్ల క్రితం నుంచి శివారు గ్రామంగా ఉండేది. 1948వ సంవత్సరంలో పంచాయతీగా పిడుగురాళ్ల ఏర్పడింది. ఆ తర్వాత 2005లో నగర పంచాయతీగా ఏర్పడింది. డిసెంబర్ 31 2010లో గ్రేడ్ 2గా అప్‌గ్రేడై ప్రస్తుతం కొనసాగుతుంది. అప్పట్లో రావి చెట్టు కింద పిడుగు పడటంతో పిడుగురాళ్లగా పిలవబడుతుందని పూర్వీకులు తెలుపుతున్నారు. పిడుగురాళ్ల పట్టణం విస్తీర్ణం 31.63 చదరపు మీటర్లు. ప్రస్తుతం జనాభా సుమారు 80 వేల పైచిలుకు ఉంది. పట్టణం 33 వార్డుల్లో సుమారు 17 వేల గృహాలు ఉన్నాయి. పట్టణంలో 3 అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం, ప్రధాన రహదారి రోడ్డు వెడల్పుతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చేయటం, పట్టణ ప్రజలకు కృష్ణా జలాలు అందించేందుకు నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికి మంచినీటిని అందించే క్రమంలో 10,724 గృహాలకు కొళాయి కనెక్షన్లు ఇచ్చారు. నూతనంగా 7,132 ఇళ్ల పట్టాలు అందజేశారు. సీసీ రోడ్ల కోసం రూ.10.96 కోట్లు ఖర్చు చేశారు. పాఠశాలల అభివృద్ధికి రూ.9.88 కోట్లు, రూ.172 కోట్లతో హాస్పిటల్స్ నిర్మాణం చేశారు. ప్రధాన రహదారి మధ్యలో లైటింగ్ ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలో ప్రస్తుతం ఓటర్లు 54,580 మంది ఉన్నారు. మొత్తం మీద పిడుగురాళ్ల పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతూ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు సమకూరుతున్నాయి. పట్టణ ప్రజల రక్షణ కోసం పోలీస్ తర్ఫీదు కార్యాలయంతోపాటు రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, వైద్యశాలలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. పిడుగురాళ్ల పట్టణానిది ప్రధానంగా సున్నం వ్యాపారం కావటంతో అందరు దీనిని లైమ్ సిటీగా పిలుస్తారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సారథ్యంలో పట్టణంలో శాంతిభద్రతలు నెలకొని విద్యా, వైద్య, వ్యాపార రంగాల్లో పిడుగురాళ్ల పట్టణం ముందుకు దూసుకు వెళ్తుంది.

నూతన కార్యవర్గం ఎంపిక

మాచర్ల: మాచర్ల పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ ఎలక్ట్రికల్ ప్లంబర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎంపిక చేసుకున్నట్లు ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి బాబురావు తెలిపారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బాలునాయక్, కోశాధికారి కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జానీతో పాటు కార్యవర్గ సభ్యులుగా చెన్నకేశవరావు, నాసర బాబు, సాగర్‌బాబు, చక్రి తదితరులును ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని యూనియన్ సభ్యులు అభినందించారు.